# మహదాశీర్వచనం

ఆయన చావడానికి సిద్ధంగా వున్నాడు. రెన్నాళ్ళయీ మూన్నాళ్ళయీ కాదు. నాలుగు సంవత్సరాలై.

ఆమె గుమ్మం ఒడ్డునే ధాన్యపునంద దాపుగా కూర్చుంది. ముందు నక్కు ఊడి కట్టులు తన్ని పెడుతున్న పాతచేట ఉంది. అందులో కొంచెం బియ్యం, వాటికెన్నో రెట్లు ముదురు నూకలు, చాలా మట్టిబెడ్డలూ కలిసి ఉన్నాయి. వాటిల్లోంచి బియ్యాన్ని ఏరి తీసుకోవడమో, రాళ్ళను ఎంచి పారేయడమో ఇంకా తేలక వాటిని ఊరికే వేళ్ళతో కదుపుతున్నది.

వీధిచీడీలో "వాడు" వదులు మఠం వేసుక్కూర్చున్నాడు. శీతాకాలపు ఎండవీపున సమానంగా తగులు తున్నది. స్నానం లేక మాగుళ్ళు పట్టిన ఎఱ్ఱని శరీరం, ఎఱ్ఱని నల్లని రోమాలు; ఒక మురికి గావంచా కట్టి ఒక మురికి గుడ్డపైన వేసుకున్నాడు. బద్ధకంగా, తీరిగ్గా, అంతా కొత్తలా – ఒకసారి రోగివంకా యింకోసారి ఆమె వంకా, మధ్య మధ్య వాకిట్లోకి చూస్తున్నాడు.

వాకిట్లో ముసలి ఆవు మగతనిద్ర చూసినా; వీధిచీడీలో ఎండపొడ చూసినా మధ్యాహ్నం రెండవొచ్చు అనిపిస్తుంది. ఎదుటి వాసకు ఆవల ఉన్న కొబ్బరితోట చల్లగా కనిపిస్తోంది. ఆ రోజు గ్రామంలో ఉండుకున్న హడావుడి కారణంగా వీధి నిర్మానుష్యంగా వుంది.

ఉండుండి రోగి ఎగశ్వాసలతో బెక్కుతుంటాడు. అలా బెక్కినప్పుడల్లా ఆమె అతని కుక్కి మంచంలోకి చూస్తుంది. నాలుగేళ్ళ దీర్ఘానుభవం పరవాలేదని చెపుతుంది. ప్రాణి సహజమైన భయం ప్రతిసారీ ఆమెను అదరగొడుతుంది. అతని శ్వాస చక్కబడ్డాక గాని ఆమె గుండెలు కుదుటపడవు. అవి కుదుటపడ్డాక ఆమె వీధిలోకి చూస్తుంది. అలా చూడగా చూడగా కామేశ్వరి కనిపించింది.

పన్నెండేళ్ళ కామేశ్వరికి పరుగెత్తడానికి సిగ్గు, నడవడానికి విసుగు. అందుచేత పరుగెడుతూ, నడుస్తూ ఇల్లు వచ్చేసిందని పరుగెత్తబోయి, నడిచి వస్తూంది.

"లేరు" ఆయాసపడుతున్నట్టు అంది.

"అన్నిచోట్లా చూసేవూ?"

"రెండు పోలింగ్‌ల దగ్గరా వెతికేను, ఎక్కడా లేరు".

కబ్బా కిందకు లాక్కుంటూ చెప్పింది.

వంటగదిలో నీళ్ళు తాగుతున్న కామేశ్వరిని అడిగింది.

"తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ ఏరే?"

"వాళ్ళంతా అక్కడే వున్నారు..." నీళ్ళు తాగడం అయ్యాక... "వాళ్ళనేమిటి; ఊరు ఊరందరూ అక్కడే ఉన్నారు".

చీకటిగా వున్న వంటింటిలోంచి వస్తూ అక్కడ తండ్రి కనిపించగా చప్న తల తిప్పేసుకొంది కామేశ్వరి. తల్లి ఒక్కొక్కటిగా ఏరి రాతిబెడ్డలు పోగు పెడుతున్నది.

"నే ఏరనా?" అన్నది పక్కను కూచుంటూ.

ఆమెకు తల్లి రోజు రోజుకూ చిక్కిపోతున్నట్టు కనబడుతున్నది. ఆవేళ మరీ సన్నంగా కనిపిస్తోంది.

"వద్దు. నువ్వు బెడ్డలు విరజిమ్ముతావు".

"లేదు. నే పోగుపెడతాను".

"అంతకన్నా మరోసారి ఆచారిగారి ఇంటికి వెళ్ళి రా."

".... .... .... ...."

"మా తల్లి కదూ!"

కామేశ్వరి మారు మాటాడకుండా లేచి వెళ్ళింది.

ఆమె వెళ్ళేక ఇక లాభం లేదన్నట్టు "వాడు" కూడా లేచేడు. లేచిన మనిషి ఆరడుగుల పొడవులా కనపడ్డాడు.

"అయితే నే ఎల్తానమ్మా".

"వెళ్ళి రా."

"మరేంవని చెప్పమన్నారు?"

"డాక్టరుగారు వచ్చేక ఇంటి దగ్గర ఎవర్నేనా పెట్టి వస్తాను".

"బేగి రండి. నాలుగు దాటిపోతే మరోట్లివ్వరుట!"

వాడూ వాకిలిదాటి నాలుగడుగులు వెళ్ళేడు–

"ఏహ్... హ్... హ్హ్... హ్..." అంటూ అప్రయ్నతంగా లోనికిపోయే గాలి స్వరపేటికలో దూరి వికృత ధ్వనులు చేస్తుండగా రోగికి మళ్ళా ఎగశ్వాస ప్రారంభం అయింది. ఆ ఎగశ్వాస మూడు నాలుగు బెక్కులతో ఆగకుండా ఇంకా సాగుతున్నది. అకస్మాత్తుగా దీర్ఘంగానే కాకుండా అతి భయంకరంగా గురక శబ్దం వినవస్తుంటే హడిలి పోయిందామె. చేతిలోని చేట చప్న పక్కకు పెట్టి వెళ్ళేసరికి రోగి ముఖం ఎఱ్ఱని ఎరుపు నుండి నల్లగా మారి తెల్లపడుతోంది.

చాలాకాలంకు మళ్ళా ఇవేళ ఒళ్ళు గజగజలాడుతున్నది. తడబడే కాళ్ళతో మంచం మీంచి లేచి మెడలో పసుపుతాడు వెతుక్కుంది. వణికే చేతులకు దొరికిన పసుపుకొమ్ము కళ్ళకద్దుకొన్నది. పిల్లలెవరూ దగ్గరలేరే అనిపించగా కళ్ళ నీళ్ళు తిరిగినట్టయ్యింది. మగతలోకి జారుకొంటున్న భర్త ముఖంలోకి చూస్తూ, నిలదొక్కు కుంటున్న కాళ్ళతో వీధి వాకిట్లోకి వచ్చింది.

ఎద మధ్యాహ్నం ఎండ ముఖాన సర్రన తగుల్తున్నది.

"ఏఁవో సత్యవతమ్మా! ఏఁవిటలా వున్నావ్?"

ఎదుటింటి వీధి గుమ్మం దగ్గర బిడ్డని అడ్డాల్లో వేసుకొని పాలిస్తున్నది శేషమ్మగారి కోడలు.

"పిన్నిగారుగాని లోపలున్నారేఁవిటి?"

"ఉన్నారు, ఏం?"

"రాత్తిర్నించీ ఆయనకు ఆయాసం! గంట గంటన్నర అవుతుంది. ఉండుండి ఎగశ్వాస వస్తోంది".

"అయ్యో పాపం".

"ఆ జామై పిల్లను ఊరల్లా తిప్పుతున్నాను. కాని ఆచారి గారెక్కడా దొరకడం లేదు".

విషయాన్ని ఒంట పట్టించుకొంటున్నట్టు ఊరుకుంది కోడలు.

"పిన్నిగారుంటే ఓసారి పంపుదురూ... ఈలోగా చూస్తారు".

"పడుకున్నారు. లేపమంటే లేపుతాను".

ఆ గొంతు విన్నాక ఏం చెప్పాలో తెలియలేదు సత్యవతమ్మకు. "లేవగానే పంపించండి" అంటూ లోనికి వెళ్ళిపోయింది.

ఏడేళ్ళ శంకరం ఎక్కడ పట్టుకొన్నాడో ఆచార్లను పట్టుకొన్నాడు. ఆయన వచ్చి రోగి నాడి చూస్తుంటే సత్యవతమ్మ ఒక్క క్షణం అక్కడే నిలబడి లోనికి వెళ్ళింది. నాడి చూడ్డం అయ్యాక రోగి ముఖంలోకి తదేకంగా చూసేడు ఆచారి. అతని ముఖంమీద చిత్రమైన చిరునవ్వూ, కళ్ళలో ఓ విచిత్రమైన మెరుపూ కనిపించేయి.

"ఓయి జీవుడా! ఇంకా ఏం బావుకొందామనయ్యా అలా కొట్టుక చస్తున్నావ్?" అన్నట్టున్నాయి. ఆనవ్వూ ఆ చూపుతో అలానే కొంత సేపుండి–

"అమ్మా! కసిన్ని నీళ్ళు కావాలి" అన్నాడు మందులజోలె తెరుస్తూ.

ఆచార్లు పుట్టుకచేత పూజారి. అవడం ఆయుర్వేద వైద్యుడు. లేనివాళ్ళ కోసం హోమియో తెలుసుకున్నాడు. ఉన్నవాళ్ళ కోసం అల్లోపతి ప్రాక్టీస్ చేస్తాడు.

కామేశ్వరి చేట ముందునుంచి లేచింది.

బోనిపెట్టె మీద ముక్కాలిపీటా, స్పిరిట్‌లాంపూ, పైన పింగాణి గిన్నెతో నీళ్ళూ ఉంచి సూదిని మరగనిచ్చేడు ఆచారి. క్రిందపడి మీదపడి కామేశ్వరి శంకరంల సహాయంతో ఎట్టకేలకు ఇంట్రావీనస్ ఇంజక్షను ఒకటి ఇవ్వగలిగాడు.

సత్యవతమ్మ ఒంటినిండా పైట కప్పుకొని వచ్చి రెండు రూపాయి కాసులు ఆయన ముందుంచింది. ఆచార్లు 'అమ్మా' అంటూ తలయెత్తి ఏమిటది అన్నట్టుచూసి "ఉంచండి" అన్నాడు – ఇదేం బాగులేదన్న భావం ధ్వనింపచేస్తూ.

మొదట్లో ఆచార్లు మొఖమాటం లేకుండానే ఫీజులు పుచ్చుకొనే వాడు. కామేశం మేష్టరు ఆ ఊరివాడే అయినా బోర్డు స్కూళ్ళ ఉద్యోగం అవడం వల్ల జిల్లా జిల్లా అంతా తిరిగి వచ్చేడు. వచ్చిన్నాటికి మనిషి పచ్చ పచ్చగా కనపడ్డాడు. రాను రాను జబ్బు, వల్లమాలినతనం, ఆరుగురు తిని కుడిచే పిల్లలతో ఆదదొక్కర్తైగా ఈదవలసిన ఆ సంసారపు పరిస్థితీ, అన్నీ ఉన్నవాళ్ళనే హడలుగొడుతున్న రోజుల భగభగలూ, గుర్తించి ఆచారి సత్యవతమ్మ ఆరాటం గమనిస్తూ కూడా, మందులతో కలిగింపలేని ఉపశమనాన్ని మాటలతో కలిగించడానికి ప్రయత్నిస్తూ, వైద్యాన్ని అల్లోపతి నుండి హోమియోపతికి మార్చేడు. ఆర్నెల్లు క్రితం ఒకసారి ఫీజు తీసుకోవడానికి నిరాకరించేడు. ఇది మళ్ళా ఆమె రెండో ప్రయత్నం. రెండు రూపాయిలు!

సత్యవతమ్మ గుడ్లనీరు కుక్కుకుంటూ తల పక్కకి తిప్పుకుంది.

ఇంజక్షన్ చేసి సూది కడుగుతూ అన్నాడు ఆచార్లు.

"ఈ యింజక్షను పట్నం పెద్ద డాక్టరుగారు నాయుడాళ్ళ పాపమ్మ కోసం స్వయంగా రాసేరు. ఆమెగారి జబ్బు ఈయన జబ్బులాటిదే కదా! డాక్టరుగారు డజను రాస్తే వీరు రెండు డజన్లు తెప్పించేరు. వారికి పైసాలకు కొదవేమున్నది! అందులోనూ వంటధాన్యాల ధరలు ఇలా మండిపోతున్నప్పుడు! ఆ యింజక్షన్లు అన్నీ వాడరాదు పోయి కనుక్కురండన్నాను. అవునండీ ఇవేం నగలా! గుడ్డలా! తినుబండారాలా! ఉన్నవి కదా అని దిగవేసుకోడానికీ, చెడమింగడానికీ – విషం! మోతాదుగా వాడితే గుణం ఎంత చేస్తుందో ఎక్కువగా వాడితే అంతగానూ వికటిస్తుంది. వాటిని ఎంతోకాలం అలమరాలలో అద్దాల తలుపుల వెనక దాచేరు. "అవి సాధారణంగా దొరకని మందులు. కొట్టువాడికేనా ఇచ్చేయండి, లేదా నా మొహానేనా కొట్టండి" అనే వాడ్ని వెళ్ళేటప్పుడల్లా. ఎక్స్‌పైరీ డేటు దగ్గర పడ్డం చూసి మొన్న ఇచ్చేరు తీసుకెళ్ళండంటూ.

"ఎందుకు చెపుతున్నానంటే – ఇవి నేను కొన్నవి కావు. నాకొకళ్ళిచ్చినవి. మరింకొకళ్ళ కిచ్చే బదులు మీకిస్తున్నాను".

"అది మాత్రం ఎంతకాదు నాయనా!" అన్నది గుమ్మం దగ్గర నిలబడిపోయిన శేషమ్మగారు.

శేషమ్మ తెల్లగా ఉంటుంది. ఆమె పలుచని జుత్తూ, చిన్న ముడీ, తెలతెల్లగా నల్లగా ఉంటాయి. కట్టుకొన్న మల్లుపంచ అతి తెల్లగా ఉంది. నిద్రలేస్తూనే రావడం వల్ల కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అరవై ఏళ్ళు పైబడ్డా ఆ వయసుకి ఆమె దృఢంగా ఉంది.

"ఎలా వుందట?" అన్నది గుమ్మంకు అవతల నుంచే.

సత్యవతమ్మ పరిస్థితి వివరిస్తుంటే ఆచార్లు కలుగజేసుకొని అన్నాడు.

"అది మరేం లేదమ్మా! రోగ తీవ్రత చేతనే అనండి, రోగి బలహీనత చేతనే అనండి. ఒక్కొక్కప్పుడు ఊపిరితిత్తులు క్షణకాలం పనిచేయడం మానేస్తాయి. గుండె, ఊపిరితిత్తుల వంటివి వున్నాయంటే మన యిచ్ఛాయిచ్ఛలతో ప్రమేయం లేకుండా పనిచేయాలి. అలాంటివి ఏ కారణం చేతనైనా పనిచేయడం మానేస్తే తక్కిన అంగాలు ఊరుకోవు. కమ్చీ పట్టుకు తరిమినట్టు తరుముతాయి. అలాంటి సందర్భంలో జటకాలో, రైల్లో హఠాత్తుగా బయలుదేరితే వస్తుంది చూసేరూ కుదుపు – అటువంటి కుదుపు ఇది".

సత్యవతమ్మ మీద యీ వివరణ బాగానే పనిచేసినట్టుంది. కాని శేషమ్మ మాత్రం వినిపించుకొన్నట్టు లేదు. ఆమె తన ఆలస్యానికి సంజాయిషీ యిస్తున్న ధోరణిలో అన్నది–––

"మధ్యాహ్నం రద్దీ అన్చెప్పి నేనూ, కోడలూ ఉదయాన్నే వెళ్ళాం. ఓట్లేసి వచ్చేసరికి పదయ్యింది. అప్పుడు వంటా, వార్పూ.... ఆలస్యంగా భోజనాలేమో మధ్యాహ్నంగా బాగా నిద్రపట్టేసింది".

ఆమె ఆగేక సత్యవతమ్మ.....

"లోపలికి రండి అక్కడే నిలబడిపోయారు!"

..... అంటూ దార్లో వున్న శంకరాన్ని తప్పుకోమంది. శేషమ్మ లోనికి వెళ్ళడమా మానడమా అన్నట్టు ఊగిసలాడి చివరకు వెళ్ళింది.

కామేశం మగతగా కన్నులు మూసి సన్నగా ఊపిరి పీలుస్తున్నాడు. ఎండి కట్టెగట్టిన శరీరం, పాలిపోయిన అరిపాదాలూ చేతులతో, భయంకరంగా ఉంది.

ఎదురింటిలోనే వున్నా ఆమె రోగిని చూసి చాలా రోజులయ్యింది. నల్ల నల్లగా, పచ్చగా, తెల్లగా పెరిగిన రోగి గడ్డం రెండు మూడు నెలలైంది. క్షవరం లేదు. వదలి గుంటలుపడ్డ ముఖంలో పూర్వం పోలికలు ఎక్కడా లేవు.

ఏభై యేళ్ళ క్రితం కాపురానికి వచ్చిన కొత్తలో పిరికి పిరికిగా కళ్ళనిండా కామం; ఒంటినిండా చిదుముతో ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు తన వంక కళ్ళప్పగించి చూసే ఎదురింటి కాంవుడు కాడీతడు. మొదటి భార్య పోయేక తనకెక్కడేనా ఓ పిల్లని చూసి పెట్టండంటూ అయిన వాళ్ళనూ, కాని వాళ్ళనూ బతిమాలుతూ బామాలుతూ అందరి మధ్యా అపహాస్యాల పాలౌతూ వచ్చిన కామన్న ఈయన కాదు. తన భర్త పోయేక కొడుకును చిన్నవాణ్ని చేసి వాడిమీద మరిదినీ మరిదిమీద వాణ్నీ పోటీలు పెట్టి వాళ్ళ భూముల మధ్యగా తనకుండుకున్న కాస్త భూమినీ కిసాయితుగా అమ్ముకోనేర్చిన కామేశం యీతడు కాడు. రిటైరయ్యాక పెద్ద అట్టహాసంగా ఒక బండిమీద సంసారం, ఇంకో బండినిండా సామానుతో "నలభై యేళ్ళకు మళ్ళా ఈ వూళ్ళో అడుగు పెడుతున్నాను" అంటూ పాత పరిచయాలు ముడిపెట్టుకొనే యత్నంలో అబద్ధాలను సుబద్ధాలుగా కలగా పులగంగా చేస్తూ వచ్చిన మేష్టరు కామేశం ఈయన కాదు. పక్షవాతం వచ్చేక పలకరించ వస్తే పిల్లల్ని చూసి బావురుమన్న ముసలి కామేశంకూ యీతనికీ పోలికలున్నాయి. ఈ మనిషి అన్నీ వదులుకొని హరినామస్మరణ చేసుకోవలసిన వయసులో మృత్యువు వస్తే మహాభాగ్యమన వలసిన పరిస్థితిలో తూస్తే తులం కండగాని, కోస్తే గుల్లడు నెత్తురుగాని లేని, పాలిపోయిన, కంపుకొట్టే పాడు బొందెను పట్టుక వ్రేలాడే – అనకూడదు గాని – పురీషంలోని పురుగు.

"ఏమిటంటారు – ఫరవాలేదా?"

ఆచార్లుకేసి తిరిగి అడిగింది శేషమ్మ.

"ఒక్క ఇంజక్షను ఇచ్చేను. దానితో తగ్గాలి, అది ఏలాంటిదంటే మన తెలుగు వైద్యంలో గరళం ఉంది చూసేరూ అలాంటిది. పనిచేసిందా రఫీమని పనిచేస్తుంది! లేకపోతే రియాక్షనిచ్చేస్తుంది. అందుకు యిలా కనిపెట్టుక కూర్చున్నాను".

రియాక్షనంటే ఏమిటని అడగలేదు శేషమ్మ.

"ఆ జీవికి అంత అదృష్టం కూడానా"

అంటూ వెనుతిరిగింది.

అప్పటి వరకూ ఆమె పక్కనే నిలబడి వున్న కామేశ్వరి లోనికివెళ్ళి ఓ పీట తెచ్చి వేసింది. "ఎందుకే" అంటూనే శేషమ్మ దానిమీద కూర్చుండపడింది.

ఆ చిన్న సోలగదిలో మంచమే నాలుగోవంతుకు అమిరిపోయింది. మిగిలిన ముప్పాతికలో పగిలి కన్నాలుపడ్డ పాత నందా, కట్లూడుతున్న పెద్ద భోషాణం పెట్టె, కోళ్ళు విరిగిన రంగం పెట్టెలు రెండూ, ఓ చిన్నట్రంకూ చోటు చేసుకున్నాయి. పడమర మూలనున్న నిలువుజాడీ తవ్వి తీసేసేరు కాని దానిమీదుగా ఉత్తరపు గోడకు సత్యవతమ్మ సవతి అమర్చిన అద్దం అక్కడే వున్నది. కళాయి కరిగి ఎర ఎర్రగా, తెల్లగా, బొల్లిగా కనబడే ఆ అద్దానికి క్రిందుగా, మీదుగా, చుట్టూ గోడల నిండా కన్నాలు చాలా వున్నాయి.

"ఎప్పుడా అద్దంచూసినా చచ్చిపోయిన మీ సవతే జ్ఞాపకం వస్తుంది" అన్నది శేషమ్మ.

ఆ అద్దం వెనుక ఓ కథ ఉన్నట్టు సత్యవతి ఎప్పుడూ వినలేదు. అత్తా ఆడబిడ్డల నడుమ ఆవిడ బ్రతుకు అడకత్తెరలో పోకలా గడిచిందని విన్నది. ఆమె చావును గురించి కూడా ఏవో గాలి కబుర్లు తమ వాళ్ళు చెప్పుకొన్నారు. ఆచార్లకి ఆ విషయాలు కొత్త.

"…. మీ అత్తగారూ, మా అత్తగారూ రామేశ్వరం వెళ్ళేరు. వస్తూ వస్తూ, రెండు అద్దాలు తెచ్చేరు. మా యింట్లో కూతుర్నయినా, కోడల్నయినా నేనొక్కదాన్నే. మీ ఇంట్లో మీ చిన్నాడబడుచుండేది. సిసింద్రీ అనేవారు దాన్ని మా వాళ్ళంతా. మీ అత్త తెచ్చిన అద్దం నాదంటే నాదనుకొన్నారట వదినగారూ, ఆడబడుచూ, ఒకనాడు అత్తా ఆడబడుచూ ఇంట్లోలేని సమయం చూసి అద్దం గోడలో పెట్టేసింది మీ సవతి. దానిమీద ఓహ్ పేద్ద రామరావణ యుద్ధమై పోయింది. మీ ఆయన పెళ్ళాన్ని తన్ని కొట్టి చంపినంత పనిచేశాడు. ఆ తరువాత దాన్ని గోడలోంచి తవ్వేరు. తీరా తీసేక ఆ అద్దం పాడైపోయింది. నాకొద్దు అంటూ పేచీ పెట్టింది మీ సిసింద్రీ. మీ ఆయనకు కోపం వచ్చి చెల్లెల్ని ఓ మొట్టికాయ మొట్టేడో, ఊరికినే తిట్టేడో – చూసేవా చూసేవా తండ్రిలేని పిల్లని చంపేస్తున్నాడంటూ అత్తగారు లంకించుకొన్నది. మళ్ళా యుద్ధం!

అప్పుడు మా అత్తగారు మా ఇంట్లో అద్దం తీసుకెళ్ళి సిసింద్రీకిచ్చి ఆ మొదటి అద్దం వదినగారి పేర గోడలో పాతించింది. ఏమిటీ…. ఆవిడా మీ సవతి పుట్టింటారూ దూరబ్బంధువులు. అదీ ఆ అభిమానం.

అంటూ ఆ అద్దం కథ చెప్పింది శేషమ్మ.

కామేశ్వరికి ఆ అద్దం కథతో ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి. ఆమె దాని వేపోసారి ఆశ్చర్యంగా చూసి శేషమ్మగారికేసి తిరిగి అడిగింది.

"మాకో చిన్నత్త వుండేదా?"

"ఉండేదమ్మా ఉండేది. నీ ఈడో నీకన్నా ఓ యేడాది పెద్దో… అప్పుడు దాని మొగుడు పోయేడు. చెట్టంత కోడలు చచ్చిపోతే మీ మామ్మ ఓ యేడుపేడ్చేసి ఊరుకొందిగాని ఆ కూతురు ముండమోసిందని అలాగేనా చూసుకోకుండా అది కూడా పోయిందనీ మహా ఏడ్చింది మీ మామ్మ. ఆ బెంగతోనే చివరకు మంచం పట్టేసి చచ్చిపోయింది కూడా. నాలుగు చావులు …. రెండేళ్ళలో, ఆ యింటికేదో శని పట్టుకుంది అనేవారంతా".

కామేశ్వరికివేవీ పట్టడం లేదు…. మేనత్తే మెదుల్తోంది ఆమె మనసులో. అడిగింది.

"ఆరోజుల్లో అంత చిన్నప్పుడే పెళ్ళా?"

"అష్ట వర్షాత్ భవేత్కన్యా… అని, ఎనిమిదేళ్ళు నిండక ముందే పెళ్ళిళ్ళకు తొందరపడేవారు. శారదా బిల్లు రోజుల్లో అయితే ఆరునెల్లు నిండని పసికందులక్కూడా పెళ్ళిళ్ళే. మీ అమ్మ పెళ్ళి శారదా బిల్లు హడావుళ్ళోనే అని జ్ఞాపకం".

అంటూ సత్యవతి వంక చూసింది! ఆమె అవునన్నట్టు తలూపింది.

"అయితే మీరు పెద్దా, మేష్టరుగారు పెద్దా?"

ఆచార్లు అడిగేడు, ఆ ప్రశ్న వెనుక భావం గ్రహించడానికి కొంచెంసేపు పట్టింది.

"ఆయనే పెద్ద. వాళ్ళ పెద్దాడబడుచూ నేనూ ఒకతోటి వాళ్ళం అనుకునే వారు అని ఆ తరువాత చెప్పింది. ఆ పిల్లను వీళ్ళ సవితి తరపు చుట్టాల కిచ్చేరు. అందుచేతే తల్లిపోయేక ఆడపిల్లను పెద్దాడపడుచు తీసుకు పోయింది. మగపిల్లవాడ్ని వాళ్ళ రెండో మేనమామ తీసుకపోయేడు. ఆ కుటుంబాల వాళ్ళందరూ డబ్బూ, దస్కంలోనేమి, మంచి మర్యాదల్లోనేమి వీళ్ళకన్నా సహస్రాంతం మెరుగు. తీసుకెళ్ళి ఇంట్లో పెట్టుకున్నదే కాక, పెద్దవాళ్ళయ్యాక పిల్లల్నిచ్చుకొని వాళ్ళ ఖర్చుల మీదే పెళ్ళిళ్ళు కూడా చూశేరు. ఇప్పుడా కూతురు మొగుడు చోడవరంలోనో, అనకాపల్లిలోనో ప్లీడరు. కొడుకు విశాఖపట్నంలో ఇన్సూరెన్స్‌లో కావోలు సూపరెంటో ఏదో చేస్తున్నాడు. అన్నట్లు మీరూ చూసేరు కదూ ఆ మధ్య ఇక్కడికి వచ్చేడు" అన్నది.

ఆచార్లు కామేశంగారి కొడుకును చూసేరు గాని, కూతుర్ని చూడలేదు. ఇంతలావూ, అంత పొడవూ వున్న నలభైయేళ్ళ టెర్లిన్ దుస్తుల వ్యక్తిని వెంట పెట్టుకు వచ్చి "మా అన్నయ్య" అంటూ పరిచయం చేసేడు శంకరం. ఎంతో సేపటికి గాని అతడు కామేశంగారి కొడుకన్న విషయాన్ని ఆచార్లు హరాయించుకోలేక పోయాడు. అతనిది పట్నం పోకడ అయినా, పల్లెటూళ్ళ సాంప్రదాయం యెరిగినవాడు. పెద్ద తెలివైన వాడిలా కనబడలేదు కాని గడుసువాడు. అవును. తనతో ఒక అరగంటసేపు మాటాడేడు. శేషమ్మ చెపుతున్నది.

"ఇదేం చేస్తుంది కాని – మొదట్నించి ఈ పెద్దమనిషి బుద్ధి మంచిది కాదు. ఎప్పుడూ కులికిద్రపు ఆలోచనలూ కుట్రబుద్ధులే గాని, తిన్నగా ఆలోచించి ఎరగడు. తనదా చూడబోతే రెండో పెళ్ళి. పిల్లలు పుట్టి పోతున్నారు. వాళ్లా ఎదుగుతున్న పిల్లలు. అలాంటప్పుడు వాళ్ళను దగ్గరకు చేరదీసి, కడుపులో ఉన్నా లేకపోయినా అభిమానం చూపించి, రాకపోకలు జరుపుతుంటే అదెలా ఉండేదీ! అప్పుడల్లా ఊరమ్మ కన్న పిల్లల్ని ఊరివారు పెంచుతున్నారన్నట్టు ఊరుకొన్నాడు. ఇప్పుడు కొసకాలం వచ్చేసరికి చేతికీ, కాలికీ కాలేని పిల్లలు నోళ్ళు తెరుచుకుంటూ దక్కి కూర్చున్నారు… ఈనాడు నీ అవసరం కొద్దీ వాళ్ళకు అభిమానం రమ్మంటే ఎలా వస్తుంది?"

ఒకసారి ఏదో వచ్చేడంటే వచ్చాడన్నట్లు ముఖంచూసి వెళ్ళిన కామేశంగారి కొడుకునూ, అసలు ముఖమైనా చూపడానికొప్పని ఆ పెద్ద కూతుర్నీ తలచుకొన్నప్పుడల్లా "కొంపతీసి నా పిల్లలు కూడ ఇలానే చేస్తారేమిటి?" అని భయపడుతూ ఉంటారు ఆచార్లు.

అప్పుడప్పుడూ రోగి చెప్పే ఛాందసపు కథలనుబట్టి ఆచార్లు అర్థం చేసుకున్నదేమంటే – కొడుక్కు కామేశం గారి యెడ అభిమానమే గాని కోడలూ, కూతురూ పడనివ్వరు. కోడలు పడనివ్వదంటే అర్థమయ్యేది కాని కూతురు కోపానికి కారణం తెలిసింది కాదు.

శేషమ్మ మళ్ళా చెప్పుతున్నది.

"ఆకాడికి రిటైరయ్యే ముందు వీళ్ళుండే గ్రామం ఏదో ఆ వూరు పని కట్టుకుని వెళ్ళేడట ఆ అబ్బాయి. 'నాన్నగారూ' అయ్యిందేదో అయిపోయింది. మీరు రిటైరయ్యాక మళ్లా మన వూళ్ళో కాపురం పెడతారని విన్నాను. అలా ఎంతమాత్రం చేయవద్దు. ఏదో పట్నంలోనే – వీలైనంత వరకూ నేనుండే విశాఖపట్నం లోనే – ఆ వచ్చే డబ్బుతో చవగ్గా ఓ జాగా కొనుక్కొని, ఓ పాక వేసుకొని, కొంత భాగంలో మీరుంటూ మిగిలినది అద్దెకివ్వండి. ఏదో నాలుగు ట్యూషన్లు చెప్పుకుంటూ ఆ డబ్బూ, ఈ డబ్బుతో పిల్లల చదువులు ఒడ్డెక్కించండి. పదేళ్ళు కష్టపడ్డారంటే ఒడ్డెక్కిపోతారు. నాకు చేతనైన సాయం నేనూ చేస్తాను' అన్నాడట. ఇంతాచెపితే పోవోస్ నీ బోడి సలహా ఎవరిక్కావాలన్నట్టు ఇక్కడకు వచ్చేసేడు. ఏమిటీ? 'నాన్నా నీకెందుకు నీ భారమంతా నే మోస్తాను' అని కొడుకు అనలేదు. అదీ ఉక్రోషం".

ఈసారి మాత్రం సత్యవతమ్మ కలగచేసుకుంది.

''అదేం కాదుగాని ఈయనగారికి ఆ అబ్బాయి దూరాలోచన అందలేదు".

శేషమ్మగారు చప్న కోపం తెచ్చుకొని అందుకున్నది...

"ఏమిటే ఆ దూరాలోచన అందకపోవడం? పెళ్ళాం పోయేసరికి యింకో పెళ్ళాం పక్కలో లేకపోతే ఎలా – అన్న దూరాలోచన చెయ్యగలడూ? పరాయి వాళ్ళ పిల్లల్ని పెంచుతుంటే – పెంచిన వాళ్ళు పెళ్ళిళ్ళెవరి కోసం చేస్తారన్న దూరాలోచన చెయ్యగలడూ? రిటైరైన సొమ్ముతో పట్నంలో కాపురం పెడితే, ఆ సొమ్ము చేయి జారిపోయేక పెద్దకొడుక్కేం దుర్బుద్ధి పుట్టునో, పెళ్ళానికేం దుర్బుద్ధి పుట్టునో అని ఈ రాకట కొచ్చాడు నీ మొగుడు.

పల్లెటూర్లో అయితే యిల్లు కొనక్కరలేదు. ఇంటద్దె అక్కరలేదు. చక్కా ఓ ఆవును గుమ్మం ముందు కట్టుకుని, పెళ్ళాం, పిల్లలు కుడిచినా మానినా కమ్మగా ఆ ఆవుపాలు తాగొచ్చు. వీడి నెత్తినా, వాడి నెత్తినా కిరిదీకి చెయ్యెడుతూ, ఉన్న డబ్బు చక్కగా కర్చు పెడుతుంటే తన జీవితం వెళ్ళిపోక పోతుందా అనుకున్నాడు. ఆ డబ్బు కాస్తా అయిపోతే, తాను వల్లకాట్లో కలిసేక – నువ్వూ, నీ పిల్లలు ఏమయిపోతారని ఒక్కనాడు ఆలోచించలేదు నీ మొగుడు. ఈ ముక్క నీ మొహాన అంటే నువ్వేడుస్తావని నేనెప్పుడూ అనలేదు. నీ సవతి కొడుక్కూడా అందుచేతే నోరు మూసుకు ఊరుకున్నాడు".

అని సత్యవతమ్మ కన్నీళ్ళను కూడా లెక్క చేయకుండా చెపుతున్నది.

"ఆ అబ్బాయన్నాడు ... ఆవేళ గజం పావలా కమ్మిన జాగా ఈవేళ ఐదు రూపాయలు అమ్మానమ్మగారూ. నాన్నగారికి తెలియదు, చెపితే వినిపించుకోలేదు. డబ్బుకి ఇవేళ ఉన్న విలువ రేపుండడం లేదు. అందులోనూ ఈ మాయముండా ప్రభుత్వం వచ్చేక డబ్బు విలువ రోజు రోజుకూ దిగజారి పోతున్నది. నాన్నగారు రూపాయికి పదహారు శేర్లు బియ్యం ఇచ్చే రోజుల్లో ప్రభుత్వం దగ్గర డబ్బు దాచటం ఆరంభించేరు. రూపాయికి శేరు బియ్యం యిచ్చే రోజుల్లో ప్రభుత్వం అతని సొమ్ము తిరిగి ఇచ్చింది. అంటే ఏమయిందో చూడండి; రూపాయి యిచ్చి, అణా పుచ్చుకొన్నట్లయింది. ఇంకా మరికొన్నాళ్ళకు యిప్పుడాయన దగ్గర ఉన్న డబ్బు ధర కూడా పడిపోతుంది" అన్నాడు. అక్షరాల అతడన్నట్లే అవుతోంది.

ఆ డబ్బంతా మందులకూ, మాకులకూ, తిళ్ళకూ ఖర్చయి పోతోంది. అదే పట్నంలో అయితే ధర్మాసుపత్రు లుంటాయి. అక్కడ ఆడవాళ్ళు కూడా ఏ కుట్లో, అల్లికలో నేర్చుకొని బ్రతకవచ్చు. ఇక్కడ ఈ ఆడమనిషి ఒక్కర్తీ ఎలా బ్రతుకుతుంది? ఈ పిల్లలందరికీ పెళ్ళిళ్ళెలా చేస్తుంది? మగపిల్లలకు చదువులెలా చెప్పిస్తుంది?

నాకతడు చెప్పిందంతా వింటే అతడి మాటల్లో బేసబవెక్కడా కనిపించలేదు. ఈ సంసారం సంసారమంతా పట్టికెళ్ళి మొయ్యమంటే ఆ ముండా విశాఖపట్నంలో తను మాత్రం మొయ్యగలడా? చూడబోతే తనకూ నలుగురు పిల్లలున్నారు. జీతమా రెండొందలో, మూడొందలో."

నిజమే సవతి కొడుకు వాదనలో సత్యవతిక్కూడా బేసబవు యెక్కడా కనిపించలేదు. కాకపోతే భర్త నెదిరించి అతనిని సరియైన దారికి మళ్ళించలేక పోయింది.

సత్యవతిని ఆమె ఐదో ఏట రెండు వందలు శుల్కమిచ్చి కొనుక్కున్నాడు కామేశం. ఆసరికి అతని వయస్సు సరిగ్గా 28 సంవత్సరాలు. కానీ గిడసగా పాతికేళ్ళ లోపే అన్నట్టుండే వాడు.

పెళ్ళయిన ఎనిమిదేళ్ళకు గాని సత్యవతమ్మ వ్యక్తురాలు కాలేదు. తరువాత పదిహేను, పదహారేళ్ళు ఆమె బ్రతుకో మహానరకం! భర్తచేత దెబ్బలే తింది. అయిన వాళ్ళచేతా, కానివాళ్ళచేతా చీవాట్లు తింది. ఇరుగు పొరుగు మొగవాళ్ళు చేసే అవమానాలు భరించింది. నోటి రంకు ఆడవాళ్ళచేత నిందలు పడ్డది. జబ్బులు, సంకటాలు, కడుపులు, కడుపులు పోవడాలు, పుట్టీ పెరిగిపోయే పిల్లలు – ఇవన్నీ భరించలేక

ఎన్నోసార్లు చావాలనుకుంది. ఒకసారి నూతిలోపడి చావురాక కాలుజారి పడ్డానన్నది. ముప్పయ్యోపడి సమీపించేక ఆమె జీవితం చక్కపడ్డది.

వరరాజుతో పోరాటం సలిపి సలిపి ఓటమి నంగీకరించిన రాజ్యలక్ష్మి ఆ రాజు పాలన క్రింద చల్లగా వర్ధిల్లినట్టు ఆమే ఆమె సంసారం వర్ధిల్లుతుండగా సవతి కొడుకు తన నూతన సిద్ధాంతాలతో దిగబడ్డాడు.

అతడు వివరించిన ఆర్థిక సత్యాలుగాని, అతడు ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ పథకాలుగాని, ఆమెకు అంతగా అర్థం కాలేదు. తన సహాయం ఉంటుంది – అన్నమాట ఒక్కటే ఆమెకు బాగా అర్థమైన విషయం.

కాని కామేశం వాటినన్నింటినీ పక్కకు నెట్టేసేడు. అతన్ని సమ్మతింప చేయడానికి సత్యవతమ్మ ప్రయత్నించడమంటే అంత కాలానికి పచ్చనవుతున్న తన బ్రతుకును మళ్ళా పొగలూ సెగలూ మధ్యకు ఈడ్వడమన్న మాట. అప్పట్లో సత్యవతమ్మ ఆ పని ఊహల్లో కూడాచేయలేదు. పైగా ఇంకో పక్షాంతర ముండెను.

తన భర్త స్వార్థపరుడు కాదని సత్యవతి ఎప్పుడూ అనుకోలేదు. కాని శేషమ్మగారు అంటున్నంత స్వార్థపరుడని సత్యవతి అనలేదు. అతని మాటతీరు లోకానికి అలా అర్థమౌతుంది.

ఒకసారి ఎవరో చుట్టాలు యేదో అన్నదాన్ని పురస్కరించుకొని అన్నాడు.

"నాదేం ఉందే... భగవంతుడు చల్లగా చూడాలిగాని నాకెవరి లక్ష్యం లేదు. నా ప్రావిడెంటు ఫండూ, ఇన్సూరెన్సూ నాకొస్తే ఉన్నదానితో కాలుమీద కాలువేసుకొని రోజులు గడిపేస్తాను. రెండు పొట్టలకెంత కావాలి ముప్పై రూపాయలు. నా దగ్గర డబ్బులో సగం వడ్డీకి తిప్పుకుంటే ఎక్కీ తొక్కీ.."

అప్పటికి తమకు పిల్లలు దక్కడం లేదు.

సంసారం పెరిగేక కూడా ధైర్యంగానే ఉన్నాడు.

"– ఎంత ధరలు మండిపోతున్నా పల్లెటూర్లో నెలకు నూరు రూపాయలుంటే రాజాలా గడిచిపోతుంది. అధమపక్షం కూర్చొని తిన్నా పదేళ్ళు గడిపేయగలను".

నిజమే, అదేదో ఆ రూపాయి విలువ తగ్గేకపోతే, ఈ మాయ రేషనింగులు ముంచుక రాకపోతే, పల్లెల్లో ధరలూ ఖర్చులూ పట్నాల వాటితో పోటీలు పడకపోతే, అంతా ఆయన అనుకున్నట్టే నడచి ఉండేది. అరవై యేళ్ళు జీవిత భారం మోసి అలసిపోయిన వ్యక్తి ఆఖరు దినాలు హాయిగా గడవదలచడం ఎందుచేతో ఇతరులకు కనపడేటంత స్వార్థంలా కనిపించలేదు సత్యవతమ్మకు.

శేషమ్మ గారంటున్నది–

"అదీ ఆ అబ్బాయి చెప్పినట్లే చేయడమైతే ఇప్పుడెంత లేదన్నా పది పదిహేను వేల ఆస్తి ఉండేది. పిల్లల చదువులూ ఆడపిల్లల పెళ్ళిళ్ళూ ఆ అబ్బాయి మాట సహాయంతో హాయిగా సాగిపోను. ఇప్పుడేమున్నది – కొత్త నీరువచ్చి పాతనీరు కొట్టుక పోయిందని ఉన్నదంతా ఊడ్చుకుపోగా అనకూడదుగాని తనుండగానే ఒంటిమీద పుస్తే పుడకా పోయేయి. నా దారి నేను చూసుకున్నాను. నువ్వూ నీ పిల్లలూ ఏ గంగలో దూకుతారో దూకండి అంటూ మంచమెక్కి పడుకున్నాడు".

అని కొంతసేపు ఊరుకొని గొంతు మారుస్తూ అన్నది.

"మనిషికి స్వర్గంగాని, నరకంగాని ఎక్కడో వుండవు. చేసుకొన్న వారికి చేసుకున్నంత – అని, ఫలితం ఇక్కడే అనుభవిస్తాం".

చాలాసేపు గదిలో నలుగురూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. సత్యవతమ్మ తల ఎత్తకుండా మధ్య మధ్య కన్నీళ్ళు తుడుచుకొంటున్నది. కామేశ్వరికి అమ్మమ్మగారు శత్రువో మిత్రమో తెలియడం లేదు. ఆచార్లు మాటలు మరచిన మనిషిలా కూర్చున్నాడు. కొంత సేపు పోయాక అడిగేడు.

"వీరికి పుట్టింటివారు ఎవరూ లేరా?"

"ఎందుకు లేరూ – ఉన్నారు. మీరూ మేమూ లేమూ? మాట సాయం చేస్తారు. ఇంకా కలిగితే ఒక పూట ఇంటికి పిలిచి పట్టెడన్నం పెడతారు. యేళ్ళతరబడి సంసారాలకి సంసారాలు మోసే సామంతులైతే పిల్లనెందుకు అమ్ముకొంటారు నాయనా!

ఇహమూ పరమూ మొయ్యవలసిన వాడు భర్త! వీరే చేతులు దులుపేసుకున్ననాడు లోకానికి ఏం కావాలి బాబూ! ఎవ్వరికీ అఖ్ఖర్లేదు. ఈ సంసారం ఎలా మంట గలసినా ఎవరూ పట్టించుకోరు".

ఆ తరువాత మరెవ్వరూ మాటాడలేదు.

కొంతసేపు పోయేక రోగికి మళ్ళా ఎగ ఊపిరి వచ్చింది. ఈసారి వెనుకటంత ఉధృతంగా రాలేదు.

అతడు తేరుకొన్నాక ఆచారి "వస్తానమ్మా!" అంటూ వాచీ చూసుకొని "మళ్ళా ఏడు గంటలకోసారి వచ్చి చూస్తాను. అప్పటికి బాగా తగ్గిపోతుందనే అనుకుంటాను" అంటూ ప్రయాణమయ్యేడు. ఆయన్ని సాగనంపుతూ అందరూ బయటకు వచ్చేరు.

"నేనూ వస్తానే. యేమైనా అవసరమైతే మళ్ళా కబురు చెయ్. నా మాటవిని నువ్వు బెంగపెట్టుకోకు. యేం జరిగినా దేవుడు మన మంచికే చేస్తాడని గుర్తెట్టుకో. నేను వస్తాను".

అంటూ సత్యవతమ్మతో కాకుండా గోడలతోనో, తలుపులతోనో చెప్పినట్టు చెప్పి నిష్క్రమించింది.

★ ★ ★

నాలుగు గంటలకు 'వాడు' రాలేదుగాని వాడి స్థానంలో ఇంకొకడు వచ్చేడు. వీడు వాడిమీద మరో మూడు నాలుగంగుళాలు ఉంటాడు. వీడు కట్టింది పెద్దగా పంచా కాదు. గావంచా పంచె, వాడికి లేని సైనుగుడ్డ బనీను వీడు వేసుకున్నాడు. వీడి పైమీద తువ్వాలున్నది.

పెరటి నూతినుండి నీళ్ళ బిందె మోస్తున్న సత్యవతమ్మ నుద్దేశించి అడిగేడు.

''ఏంవవమ్మా! నాలుగున్నర అయిపోయింది. యింకెప్పుడొస్తారు?"

నీళ్ళు గోలెంలోకి ఒంపుతూ నూతి దగ్గరున్న కామేశ్వరిని కేకవేసింది సత్యవతమ్మ. వచ్చాక–

"ఆ బిందే బాల్చీ ఇంట్లో పెట్టి నాన్నగారి దగ్గరుండు, నేనిప్పుడే వస్తాను" అన్నది.

ఇంక ఆవిడ బయలుదేరడం నిశ్చయమని తెలుసుకొని వాడు తిరిగిపోయేడు. వెళ్ళే ముందు భర్త వంక ఓసారి చూసి వీధి వాకిట్లోకి వచ్చింది. బొంగరాలు ఆడుతున్న శంకరాన్ని ఎటూ పోవద్దని మళ్ళా మళ్ళా చెప్పింది. వీధిలో ఎదురుపడ్డ రెండోదాన్ని ఇంటి దగ్గరే వుండమని దానితో వస్తున్న కడసారపువాడు తోడుగా కొత్త బడికేసి నడిచింది.

కామేశ్వరి తల్లి కూర్చున్నచోట తల్లిలానే కూర్చుని ఆవిడ ఏరగా మిగిలిన రాళ్ళు ఆవిడలాగే ఏరుతోంది. మధ్య మధ్య తండ్రికేసి చూస్తూ అప్పుడప్పుడు పెరట్లోకి చూస్తోంది. తలుపు వేసేస్తే చీకటి, వెయ్యకపోతే కుక్కలు.

వీధి వాకిట్లో బొంగరాలు ఆడుతున్న శంకరం పక్కింటి కంసాలాళ్ళ కుర్రాడితో అంటున్నాడు.

"మేం విశాఖపట్నం వెళ్ళిపోతాము!"

"కొయ్!"

"నిజం!"

"ఎప్పుడు?"

శంకరం గొంతు తగ్గించి చెప్పేడు. ఆ కుర్రాడు కూడా గొంతు తగ్గించేడు.

కామేశ్వరికి విశాఖపట్నంను గురించిన భ్రమలు ఇప్పుడు లేవు. కాని అనుమానాలు ఇంకా మిగిలి ఉన్నాయి. ఏమైనా అది అప్పట్లో మాటలా కనిపించడం లేదు.

ఆమె కామేశంవంక చూసింది. అతడి కళ్ళు మగతభారం వల్ల అరవిచ్చి ఉన్నాయి. గుండెలవంక చూసింది. దుప్పటి కింద గుండెలు లేచిపడ్డం ఆగిపోయినట్టనిపించింది. క్షణకాలం కామేశ్వరి గుండెలు దడదడలాడేయి. తరువాత తండ్రి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు స్పష్టంగా కనిపించేయి.

''ఛీ!'' అనుకుంది కామేశ్వరి తనను తానే మందలించుకుంటూ.

ఆ పిల్లకు పాపపు ఆలోచనలంటే తగని భయం. ఎంత ప్రయత్నించినా వాటి నుండి తప్పుకోలేదు.

తన తల్లికి కూడా తన ఆలోచనలవంటి ఆలోచనలొస్తాయా? రావచ్చు అన్న అనుమానం వున్నా రావనే చెప్పుకొంటుంది. కానీ మళ్ళా నమ్మలేదు.

అలానే అన్నయ్య గురించిన ఊహలు కూడా. ఆమె ఇదమిద్ధమని తేల్చుకోలేదు. మాట వరసకు...

ఇప్పుడు కాదుగాని ఎప్పుడో ఒకప్పుడు అందరూ దిక్కులేని వాళ్ళయిపోతారు కదా! అప్పుడు అతడు పిలవక పోయినా మొండికేసి అందరూ వెళ్ళి వాళ్ళ యింట్లో కూర్చుంటారనుకో. అతనేం చేస్తాడు? అసలు వదిన లోనికి రానిస్తుందా? ఆమెను ఒక్కసారంటే ఒక్కసారి చూసింది – చాలా చిన్నప్పుడు. అది చాలు. వాళ్ళ పిల్లలంతా బస్తీ పిల్లలు. అందంగా షోగ్గా వుంటారు. ఆమె ముందూ, వాళ్ళ మధ్యా, అమ్మా తామూ వుండడం అసలు మంచిది కాదు. ఆ సంగతి అమ్మకు తెలుసు. కాని తమకింకేమిటి దారి?

అసలు ఎవ్వరి సహాయం లేకుండా తాము బతకలేరా?

బతకొచ్చనే కామేశ్వరి విశ్వాసం.

కానీ బతకలేరన్నట్టు మాటాడుతారు అందరూ. తల్లికూడా బతకలేమనే నమ్మకం – అలాగే కనిపిస్తుంది ఆమె మాటతీరు.

పెద్దగా అరుస్తూ వీధిలో బచ్చీలాట ఆడుతోంది పెద్దచెల్లి. ఎప్పుడొచ్చిందో చిన్నది దానితో సమంగా గొంతుపెట్టి అరుస్తోంది. శంకరం మధ్య నిలబడి తగువు తీరుస్తున్నాడు.

గట్టిగా దీర్ఘంగా మూలిగేడు తండ్రి. కామేశ్వరి చేట వదలి లేచి తండ్రి దగ్గరకు వెళ్ళింది. ఒంటరిగా కామేశం దగ్గిర ఉండడమంటే ఆ పిల్లకు భయం. కాని వీధిలో ఆడుతున్న పిల్లలు ఎదురుగా కనబడుతున్నారు.

మగతగా అరవిచ్చుకొన్న లోతుకళ్ళు ఆమె చూస్తూ ఉండగానే తెరుచుకున్నాయి. ఎంతసేపు చూసినా ఆ గాజుకళ్ళలో చలనం లేదు. వీధిలో చెల్లెళ్ళి పిలుద్దామనుకుంటుండగా పెదవులను మూసుకొని పొడిగుటక మింగేడు కామేశం .... తరువాత రెప్పలు నెమ్మదిగా కదిలేయి. ఆ తరువాత కన్నులకు చూపు వచ్చినట్టయింది.

తల తిప్పి ఎదుటనున్న పిల్లకేసి చూసేడు రోగి. కొంతసేపు చూసేకగాని ఆమెను పోల్చుకోలేక పోయాడు.

అతని చూపులు వంటింటికేసి మళ్ళేయి. తల వెనక్కు తిప్పలేక వీధిలోకి చూసే ప్రయత్నం మానుకున్నాడు. తల్లికోసం వెతుకుతున్నాడని గ్రహించిన కామేశ్వరి గట్టిగా అరచి చెప్పింది.

'లేదు, అవతలకెళ్ళింది. ఇప్పుడే వస్తుంది'.

ఏదో చెప్పడానికి నోరూ పెదవులూ కదుపుతున్నాడు తండ్రి. స్వరపేటిక పలకకపోగా గొంతులోంచి బుస్సు బుస్సుమంటూ వచ్చేస్తోంది గాలి. దాహమంటున్నాడా?.... పెదవులను తడారిన నాలుకతో తడుపుతున్నాడు మెల్లిగా.

వంటింటిలోకి వెళ్ళి కలిపి సిద్ధంచేసిన గ్లూకోజ్ నీళ్ళు తెచ్చింది. గుమ్మం దగ్గర మూగిన పిల్లల్ని పోయి ఆడుకోమని కసిరింది. ఒక్కొక్క చుక్క చొప్పున ఆ నీళ్ళు – ఆశగా తెరుచుకున్న ఆ రోగి గొంతులో పోసింది.

గ్లాసుడు గ్లూకోజ్ తాగేక తాగడం చాలించి మగతగా కన్నుమూసేడు కామేశం. తండ్రి మరి చావడు.

గోవులు వచ్చేవేళ సత్యవతమ్మ ఇంటికి వచ్చింది. తల్లితో జరిగిన సంగతంతా చెపుతోంది కామేశ్వరి. సత్యవతమ్మ భర్త కాళ్ళ కడదిక్కున కూచొని వింటోంది. వీధిలో శేషమ్మగారి కోడలు కావోసు అడుగుతోంది.

“ఏమే చిన్నపిల్లా! మీ అమ్మా ఓటు వేసి వచ్చిందేమిటి?”

“అదెప్పుడొచ్చేసింది! చాలా సేపయ్యింది”.

“మీ నాన్నకెలా ఉందే?” ఆమె భర్త.

“తెలివొచ్చింది. బార్లీ, పాలు తాగి పడుకొన్నారు”.

“అన్నట్టు ఇంట్లో బార్లీ గింజలు అయిపోయేయి, తెప్పించాలి”అని జ్ఞాపకం చేసింది కామేశ్వరి.

సత్యవతమ్మ వినిపించుకున్నట్టు లేదు. చెక్కిలి చేతికానించి కొయ్యబొమ్మలా కూర్చుంది. కొంతసేపు చూసి వంటింటిలో బిందె, బాల్చీ తీసుకొని నూతివద్దకు నడిచింది కామేశ్వరి.

★ ★ ★

అసుర సంధ్యవేళ. రానున్న రాత్రికై సిద్ధమౌతోంది, గ్రామం. పగలల్లా అందమైన వేషాల్లో ఉండి రాత్రి నిజరూపాలు పొందనున్న రాక్షసగణంలా ఉన్నాయి చెట్లు. చెట్లు చీకట్లకోసం ఎదురు చూస్తున్నాయి.

అక్కడక్కడ కొబ్బరిచెట్లు, చుట్టూ ఊడిక దొంకలు! ఆ పెద్ద పెరట్లో కామేశ్వరి ఒక్కర్తే నించొని నీళ్ళు తోడుతోంది. నంద నూతిలో వేసిన చేద నూతిలోనే వుంది. మనసులో భావాలు మాటల్లో పేర్చుకొంటున్నది కామేశ్వరి.

“మా అమ్మను నేనెరిగున్నప్పటి నుంచీ చూస్తున్నాను. ఆమె ఎప్పుడూ ఏడుస్తూనే ఉంది. ఆమె ఏడవని రోజంటూ ఎప్పుడేనా వస్తుందా? ఆమెకు ఎప్పటికీ కష్టాలనుండి విడుపు!” అనుకొంటోంది కామేశ్వరి.

అదే సమయాన వీధికి ఆవలికొస పెరట్లో శేషమ్మ ఉన్నది. కోడలు వాకిలిచిమ్మి కళ్ళాపు జల్లుతోంది. శేషమ్మ మనవడికి గోరుముద్దలు తినిపిస్తూ అంటున్నది.

“దేవుడు ఎవరి నుదుట ఎంత వ్రాసేడో అంతా అనుభవించి తీరాలను కుంటూనే. కర్మసూత్రం ఎవరూ తప్పించుకోలేరు. అది ముక్కుతాడు పట్టుక లాగుతున్నంత సేపు ఎటులాగితే అటు వెళ్ళవలసిందే. మనం చేయగలిగింది ఏమీలేదు”.

ఆచారి కూడా అలాంటి మనఃస్థితిలోనే ఉన్నట్టున్నాడు – మందులకోసం వచ్చిన జనంతో మాటమీద మాటలా గట్టిగా అంటున్నాడు.

“అన్నా! అది మానవ ధర్మమండీ! మన కిష్టమయ్యేనా అన్ని పన్లూ చేస్తాం. మన కిష్టం లేకపోయినా కొన్ని పనులు చేస్తాం. ఎందుచేత? అది విధి గాబట్టి. అక్కడ లెక్కలోకొచ్చేది కష్టనష్టాలు కాదు, ధర్మం! ధర్మమొక్కటే. ఆ ధర్మమే లేకపోతే ఈ లోకం ఇలా నిలవదు...” అంటున్నాడు.

చీకటి బాగా పడింది. ఊరవతల కొత్తబడి కొత్తగా కట్టిన పెంకుటింట్లో పెట్టేరు. రోజూ ఈవేళ కది నిర్మానుష్యం. ఈ నాడది పోలింగాఫీసర్లూ, పోలీసులతో అలికిడిగా ఉంది. టైమయ్యాక తలుపులు వేసుకొన్న పోలింగ్ ఆఫీసర్లు శాస్త్రోక్తంగా ఉత్తర విధులు నిర్వర్తిస్తున్నారు. వాళ్ళు మాట్లాడే తీరూ, కదలికా అర్ధరాత్రి ఇంట్లో పడ్డ దొంగల చందంగా ఉంది. ఉండుండి ఉద్యోగి ఒకడు ఉషారెక్కిన కుర్రాడిలా ఆరంభించేడు.

“శతమానం భవతి శతాయుః పురుషశ్శతేంద్రియ ఆయుష్యేవేన్ద్రియే ప్రతితిష్ఠతి!”

అని గట్టిగా అని––

“ఆ చివార నిమిషంలో వచ్చిన ఆడమనిషి ఓటుతో కలిపితే సరిగ్గా వెయ్యి. ఆ అమ్మ ఎవరోగాని వెయ్యేళ్ళు పసుపు కుంకంతో వర్ధిల్లుతుంది.”

అంటూ అంతవరకూ లెక్కిస్తున్న ఓటర్ల జాబితా ముడిచేసేడు.

ఆ మనిషి హోదాలో చిన్నవాడైనా వయసులో పెద్దవాడు. ఆయన దీవన ఊరికెనే పోరాదు. ★

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 27 ఏప్రిల్ 1967)